రబీలో రైతులకు కలుపు బెడద

- సకాలంలో నివారించకుంటే పంటకు నష్టమే
- కలుపు నిర్మూలనకు సూచనలు తప్పనిసరి
- పరిమితంగానే పురుగు మందులు వాడాలి



పినపళ్లలో వరి చేలల్లో కలుపు నివారణకు రసాయన మందులు పిచికారీ చేస్తున్న రైతులు

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఈ ఏడాది రబీ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీని వల్ల పంట త్వరితగతిన చేతికి అందాలనే ఉద్దేశంతో అనేక మంది రైతులు వెదజల్లు విధానాన్ని ఎంచుకున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం వరినాట్లు చురుగ్గా వేస్తున్నారు. రబీ సీజన్‌లో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడంతో పంట దిగుబడి, తెగుళ్ల వ్యాప్తి పైనా అన్నదాతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. అలాగే ఈ ఏడాది గోదావరి డెల్టా కాలువలకు మార్చి నెలాఖరు నాటికి సాగునీరు సరఫరా చేస్తామని నీటి పారుదల శాఖ ప్రకటించడం రైతులను మరింత కలవరపరుస్తుంది. ఈ నేపథ్యంలో తక్కువకాలంలో పంట దిగుబడికి వచ్చేలా సాగు చేపట్టాలని వ్యవసాయశాఖ సూచించడంతో దానికనుగుణంగానే రైతులు వెదజల్లు విధానాన్ని ఎంచుకున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలో సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. అందులో సుమారు 70 శాతం మేర పంట భూమిలో రైతులు వెదజల్లు విధానాన్ని అవలంబించారు. వరిసాగులో సాధారణ పద్ధతిలో కంటే వెదజల్లు విధానంలో సాగు చేసే పొలాల్లో కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వరి మొక్కతో పాటు కలుపుమొక్క సమాంతరంగా పెరుగుతుంది. ఈ కలుపు మొక్కలను సకాలంలో నివారించకుంటే అవి ఎరువులను, భూమిలోని సహజ పోషకాలను ఉపయోగించుకుని క్రమేపీ వరి మొక్కలను అధిగమించి పెరుగుతాయి.

పంట పొల్లాల్లో అధికంగా ఉన్న కలువు తీవ్రత

క్లస్టర్ పరిధిలోని 11 మండలాల్లో వెదజల్లు పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టంగా ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయశాఖ సూచనలు, సలహాలు లేకుండా కలుపు నివారణకు ఏ విధమైన క్రిమిసంహారక మందులను వినియోగించవద్దని అధికారులు చెబుతున్నారు. వెదజల్లు చల్లిన రైతులు కలుపు నివారణకు రసాయన మందులను నిర్ణయించిన మోతాదులో సకాలంలో వాడాలని ఆలమూరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు చెబుతున్నారు. వెదచల్లిన పొలాల్లో కలుపును సమర్థవంతంగా నివారించి తెగుళ్లను అధిగమించగలిగితే నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ఆయన భరోసాను ఇస్తున్నారు.

కలుపు మొక్కలతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది



వాతావరణ పరిస్థితులు ప్రభావం వల్ల రబీ సాగు ప్రారంభంలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో తక్కువ రోజుల్లో పంట దిగుబడికి వచ్చేలా సాగు చేపట్టాలన్న అధికారుల సూచనల మేరకూ వెదజల్లు విధానానికి ప్రాధాన్యతనిచ్చాం. అయితే వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత అధికంగా ఉండటంతో విరివిగా కలుపు మందులను వినియోగించవలసి వస్తుంది.

– తోరాటి వెంకన్న, రైతు, సంధిపూడి

కలుపు నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



కలుపు మొక్కల నివారణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ సూచనల మేరకు కలుపు మొక్కల ఆధారంగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలి. వరిచేలల్లో కలుపును సమర్థవంతంగా నిర్మూలిస్తే అధిక దిగుబడులు సాధించే వీలు కలుగుతుంది.

– కాకి నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు వ్యవసాయ సబ్ డివిజన్

క్లుప్తంగా

ఘనంగా నీలకంఠేశ్వరుని కల్యాణం



అంతర్వేది శివాలయంలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో కొలువైన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణం పురస్కరించుకుని స్వామికి మోరికి చెందిన చింతా నరసింహారావు పట్టువస్త్రాలు సమర్పించారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగప్రతిష్ఠ మహోత్సవ పూజలు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరం పాశర్లపూడిలంకలో కొలువైన వల్లీ, దేవసేన సమేత నాగేంద్రస్వామి దివ్య కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం నాగప్రతిష్ఠ మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు గంటి బాలసుబ్రహ్మణ్య శర్మ, ఆదిరాజు నరసింహమూర్తి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు దివ్య కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ భక్త బృందం తెలిపింది.

వైభవంగా గ్రామోత్సవం

మామిడికుదురు: బి.దొడ్డవరంలో ఉమా సోమేశ్వరస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మూడో రోజు విగ్రహాలను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపించారు. భక్తుల కోలాహలం, మేళ తాళాల నడుమ ఈ కార్యక్రమం కన్నులపండువలా జరిగింది. పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, నవగ్రహ కల్పం, మూల మంత్ర జపాల నడుమ రమణీయంగా జరిపించారు. ఈ పూజల్లో కంభంపాటి సుబ్రహ్మణ్య శ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకటరామనాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు కర్తలుగా పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

అంబాజీపేట: వరి నాట్లు వేసిన సమయం నుంచి మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద పొలంబడి కార్యక్రమాన్ని సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుల మందులను విక్రయించకూడదన్నారు. అవసరం మేరకు ప్రకృతి సహజ సిద్ధమైన ఎరువులను వ్యవసాయాధికారుల సూచనల మేరకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, ఏఈఓ డి.దుర్గారావు, జావేద్‌శాస్త్రి, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో బీబీ జైనబ్ జయంతి

మామిడికుదురు: ముస్లిం ఆరాధ్యులు ఇమామ్ హజరత్ అలీ, బీబీ ఫాతిమా జహెరాల తనయురాలు జనాబ్ బీబీ జైనబ్ జయంతిని శుక్రవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా నగరం గ్రామంలోని మంజిలే కర్బలాలో ఖాసిం మహ్మద్ రాజ (రజ్వీ) ఆధ్వర్యంలో మిలాద్ జరిగింది. ఇస్లాం చరిత్రలో ఆదర్శ వనితగా బీబీ జైనబ్‌ను ఆరాధిస్తారు. మిలాద్‌లో భాగంగా సజ్జాద్ హుస్సేన్ (సాజిద్) కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

జెడ్పీ హైస్కూల్‌కు ప్రింటర్, జిరాక్స్ మెషీన్ బహూకరణ



సఖినేటిపల్లి పాఠశాలకు ప్రింటర్, జిరాక్స్ మెషీన్ ఇస్తున్న ఎస్ఎంసీ కమిటీ

సఖినేటిపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు శుక్రవారం రూ.20 వేలు విలువ చేసే ప్రింటర్, జిరాక్స్ మెషీన్ ఎస్ఎంసీ కమిటీ బహూకరించింది. ఇందుకు గాను ఎస్ఎంసీ చైర్మన్ కొండా కిషోర్, కమిటీ సభ్యులు శ్రీను, నాగయ్య, దీప్తి, సరస్వతి, స్వరాజ్యం సహకరించారు. ఈ మేరకు దీనిని పాఠశాల హెచ్ఎం కోలా వీరాస్వామికి అందజేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మలికిపురం: ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం గ్రామాల వారీగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు పేర్కొన్నారు. మండలంలోని కేశనపల్లిలో శుక్రవారం లక్కవరం పశువైద్యశాల అధికారులతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.

నేటి నుంచి సత్తెమ్మ జాతర మహోత్సవాలు

- నాలుగేళ్ల అనంతరం ఉత్సవాలు
- 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా కార్యక్రమాలు

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో నాలుగు సంవత్సరాల అనంతరం సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమై 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. గ్రామంలో అమ్మవారి విగ్రహం స్వయంభువుగా ఒక రాత్రిపూట వెలిసిందని గ్రామస్తులు చెబుతారు. అప్పటి నుంచీ బండారు వారి ఆడపడుచు సత్తెమ్మతల్లిగా విరాజిల్లుతుంది. ఆ విగ్రహం స్థలాభావం కారణంగా అక్కడే అతి చిన్న ఆలయంలోనే ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. తొలుత గ్రామస్తులతో సాధారణంగా పూజలందుకున్న అమ్మవారు సుమారు 28 ఏళ్లుగా ప్రతి నాలుగేళ్లకోసారి ఇంతింతై వటుడింతై అన్నట్టు అమ్మవారి జాతర మహోత్సవాల స్థాయి పెరుగుతూ వచ్చింది. తొలి రోజుల్లో చింతపల్లి బాలు అనే ఆలయ సమీప భక్తుడు ముందుకు వచ్చి తన స్థాయిలో జాతర మహోత్సవాలు నిర్వహించారు. అప్పట్లో రూ.15 వేలు ఖర్చయిందని స్థానికులు తెలిపారు. ఆ తరువాత నుంచి అతడికి గ్రామస్తులు సహకరిస్తూ వచ్చారు. అలా ప్రతి వార్షికోత్సవానికి



వాడపాలెం సత్తెమ్మ అమ్మవారు

జాతర మహోత్సవాల వ్యయం రూ.వేలు నుంచి రూ.లక్షలకు పెరిగింది. ఈసారి జాతర మహోత్సవాలను పూర్వ ఉత్సవ నిర్వాహకుడు చింతపల్లి బాలుతో పాటు జెడ్పీజీహెచ్ కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి, కట్టా శ్రీను తదితరుల ఆధ్వర్యంలో స్థానికులు, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికుల విరాళాలు సుమారు రూ.50 లక్షల వ్యయం అంచనాతో ఉత్సవాలు చేపట్టారు. గ్రామ ముఖద్వారం బస్టాండ్ నుంచి వానపల్లి రోడ్డు, మార్కెట్, సుభాష్‌చంద్రబోస్ విగ్రహం, బజారు వీధి, అమ్మవారి ఆలయం గుండా తిరిగి బస్టాండ్ వరకూ భారీ ఎత్తున విద్యుదీకరణ గ్రామానికి నూతన కళ తీసుకువచ్చారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు జబర్దస్త్ టీమ్ కళాకారులు, కూచిపూడి, భరతనాట్యం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ ఎత్తున బాణసంచా కాల్పులు విశేషంగా అలరించనున్నాయి. 9న సుమారు 25 వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నారు.

గొప్ప మార్గదర్శి సోమసుందరరెడ్డి

నివాళులర్పించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి గొప్ప మార్గదర్శిగా పేరొందారని, నియోజకవర్గం రాజకీయాల్లో ఆయన ముద్ర చెరిగిపోనిదని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక హీరో షోరూం ఆవరణలో శుక్రవారం సోమసుందర రెడ్డి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం ముందు విగ్రహాన్ని ఉంచి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమసుందరరెడ్డి నియోజకవర్గానికి అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, కొత్తపేట జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ముత్యాల వీరభద్రరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, ముసునూరి వెంకటేశ్వరరావు తమ్మన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేకత చాటుకుని చరిత్ర సృష్టించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు అన్నారు. సోమసుందరరెడ్డి వర్ధంతి సందర్భంగా గంటి పల్లిపాలెం గ్రామంలో ఆయన విగ్రహానికి సర్పంచ్ బంగార్రాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, పంచాయతీ సభ్యుడు నేరేడుమిల్లి నరేష్, గ్రామ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సోమసుందరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు సూర్యారావు, జగ్గిరెడ్డి

మాజీ మంత్రిని కలసిన 'గన్నవరపు'

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ను అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట పార్టీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, పార్టీ నాయకులు ఉన్నారు.



మాజీ మంత్రి విశ్వరూప్‌ను కలసిన పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మొక్కలు.. ముచ్చటగా మూడొచ్చాయ్..

అంబాజీపేట: సాధారణంగా కొబ్బరి కాయ నుంచి ఒక మొక్క మాత్రమే వస్తుంది. మూడు మొక్కలు వస్తే ఆశ్చర్యమే.. అంబాజీపేట హడ్కో కాలనీలో ఉన్న సూదాబత్తుల శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో కొబ్బరి మొక్కలను తయారు చేసేందుకు ఉంచిన కొబ్బరి రాశి ఓ కాయకు మూడు మొక్కలు రావడం అందరినీ అబ్బురపరిచింది. దీనిపై స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి బీవీ చలపతిరావు మాట్లాడుతూ కొబ్బరికాయలో మూడు కార్పల్ (అండాశయాలు) ఉంటాయన్నారు. సాధారణంగా ఒక కార్పల్ నుంచి ఒక మొక్క మాత్రమే వస్తుందన్నారు. ఒక్కోసారి అరుదుగా రెండు మొక్కలు వస్తాయన్నారు. మూడో కార్పల్ ఓపెన్ కావడం వల్ల మూడు మొక్కలు ఎప్పుడోగాని రావన్నారు. ఇది సామాన్యమైన విషయం కాదన్నారు.



అంబాజీపేటలో కొబ్బరికాయకు మొలకెత్తిన మూడు మొక్కలు

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని సూచించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల, మండల స్థాయిలో ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. మండల స్థాయిలో ఎం.సింధు, ఎల్.చరణ్‌లకు రూ.2 వేలు, రూ.1500 నగదు బహుమతులు అందించారు. పాఠశాల స్థాయిలో 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు రూ.1500, రూ.1000 ప్రథమ, ద్వితీయ బహుమతులుగా అందజేశారు. దీంతో పాటు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన పోతుల రాహుల్, కాంబ్రేగుల ఇంద్రాలక్ష్మికి ఒక్కొక్కరికి రూ.2,500 నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ జయంతి

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామానికి చెందిన ప్రముఖ దాత, డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ జయంతి వేడుకలు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సైకిల్‌షాపు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి, కేశవదాసుపాలెం కాలువమొగ సెంటర్లో ఆయన ఫ్లెక్సీకి కుమారుడు, మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్ర కుమార్, ఆయన సోదరులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. అనంతరం అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం గ్రామాల్లో పేదలకు దుప్పట్లను నాగేంద్ర కుమార్ పంపిణీ చేశారు. వీటితో పాటు ఆయా జెడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, పెన్నులు కూడా ఆయన అందచేశారు. రత్నం మెమోరియల్ సంక్షేమ సంఘ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గీత కార్మికుల అభ్యున్నతికే మద్యం షాపుల కేటాయింపు

ఆలమూరు: ప్రభుత్వం రాయితీపై మంజూరు చేస్తున్న మద్యం దుకాణాలను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెవీడీకే ప్రసాద్ అన్నారు. స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఐడీ నాగేశ్వరరావు అధ్యక్షతన గీత కార్మికులతో శుక్రవారం జరిగిన సమీక్షలో సూపరింటెండెంట్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా గీత కార్మికులకు 13 మద్యం షాపులను కేటాయించిందన్నారు. అందులో సామాజిక సమీకరణాలు, ప్రాంతాల ప్రాముఖ్యతను బట్టి 12 షాపులు శెట్టిబలిజలకు కేటాయించగా గౌడ్ కులస్తులకు ఒక షాపు కేటాయించారన్నారు. లాటరీ విధానంలో దక్కించుకున్న మద్యం షాపులకు ప్రభుత్వానికి చెల్లించవలసిన రుసుంలో 50 శాతం మేర రాయితీని అందిస్తున్నామనారు. ప్రభుత్వం అందించే ఈ రాయితీల వల్ల గీత కార్మికుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. కాని ఒకటి కంటే ఎక్కువ షాపులు లాటరీలో తగిలినా ఒక షాపు మాత్రమే కేటాయిస్తారన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సమయం దగ్గర పడుతున్నందున సర్కిల్ పరిధిలో కేటాయించిన మూడు దుకాణాలకు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు తిరిగి చెల్లించని రూ.రెండు లక్షల డీడీ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. ఈనెల ఐదుతో దరఖాస్తుల స్వీకరణ పూర్తవుతుందని, ఆరున దరఖాస్తులను పరిశీలించి ఏడున లాటరీ తీయనున్నామన్నారు. ఎక్సైజ్ ఎస్సై పి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమానికి తరలిరావాలి

అయినవిల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామం సవరపు శ్రీనివాసరావు సెంటర్లో భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సవరపు గణపతిరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేలగొంతులు కార్యమానికి ప్రతి మాదిగ బిడ్డ డప్పు తీసుకుని తరలి రావాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు రాయి బులిరెడ్డి మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలమందిరం

ఆలమూరు: మండలంలోని చింతలూరు ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలమందిరం సాహిత్య కార్యక్రమం విద్యార్థులను అలరించింది. స్థానిక పాఠశాల ఆవరణలో శ్రీమతి అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ (సాల్క్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బాలమందిరం కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత అంగర గోపాల కృష్ణచార్యులు (కృష్ణశ్రీ) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడు, నాలుగు, ఐదో తరగతుల విద్యార్థులకు సాహిత్య పఠనం, కథా వస్తువు తయారీ, భాషా నైపుణ్యం నాటకీకరణ, గేయ రచనలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు సాహిత్య పఠనంలో శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులే రచయిత చెప్పిన కథాంశాన్ని ఆధారంగా చేసుకుని రచనలు చేసుకున్న విధానం అందరినీ ఆకట్టుకుంది. ఈ బాల మందిరం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠశాలలో దశల వారీగా నిర్వహిస్తామని రచయిత కృష్ణశ్రీ ఈసందర్భంగా తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉడతా వెంకటేశ్వరరావు, సహోపాధ్యాయుడు వి.దుర్గాప్రసాద్, సీఆర్ఎంటీ యడ్ల అపర్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలి

కొత్తపేట: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను కాపాడుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పిలుపునిచ్చారు. సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం శుక్రవారం స్థానిక బాలయోగిపేటలో నిర్వహించారు. పాలూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ(జేపీ), జిల్లా మోర్చా ఉపాధ్యక్షుడు బల్ల రాజు, జిల్లా బీజేపీ కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విగ్రహాల ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: మండలంలోని గొంది గ్రామంలో శుక్రవారం అమ్మవార్ల నూతన ఆలయ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ఆదివీర్లమ్మ, కనకదుర్గమ్మ, మావుళ్ళమ్మ, పుంతలో ముసలమ్మ విగ్రహాలకు కమిటీ సభ్యులు విశేష పూజలు చేసి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులపండువగా చేశారు. ఎమ్మెల్యేను సంప్రదాయబద్ధంగా దుస్తులతో వారు సత్కరించారు. ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు. అంతర్వేది క్షేత్రంలో ఆయా శాఖల ద్వారా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే దేవ పరిశీలించారు. రహదారులు పక్కన జంగిల్ క్లియరెన్స్ పర్యవేక్షించారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు

రాజోలు: బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఉత్తమ బూత్ లెవెల్ అధికారిగా అవార్డు అందుకున్న వీఆర్వో రాజ్ తరుణ్, గణతంత్ర వేడుకల్లో ఉత్తమ వీఆర్వోగా అవార్డు అందుకున్న తోలేటి బాలాజీలను వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అలాగే ఉత్తమ తహసీల్దారు అవార్డు గ్రహీత ఎన్.ఎస్.ప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలన్నారు. వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రం, సంఘ అధ్యక్షుడు చాగంటి రాజ్‌కుమార్, కార్యదర్శి కదలి శ్రీనివాస్, సోడదాశి సునీల్ రాజా, కలిగితి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.1.47 కోట్ల ఎన్ఆర్‌జీఈఎస్ నిధులతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎంపీడీఓ ఎ.రాజు పరిశీలించారు. కలవచర్ల, పెనికేరు, నవాబుపేట, మూలస్థాన అగ్రహారంలో ఆయన పర్యటించి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి సీసీ రోడ్డు, భవన నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

కొత్తపేట డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ



మురళీమోహన్

కొత్తపేట: స్థానిక సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ)గా సుంకర మురళీమోహన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. జనవరి 17న రాష్ట్ర వ్యాప్తంగా నూతన డీఎస్పీలకు పోస్టింగులతో పాటు వివిధ సబ్ డివిజన్లలో పనిచేస్తున్న డీఎస్పీలకు బదిలీలు, వివిధ పోలీస్ అనుబంధ విభాగాల్లో పని చేస్తున్న డీఎస్పీలకు ఎస్‌డీపీఓగా పోస్టింగుల్లో భాగంగా ఇంటలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న సుంకర మురళీమోహన్‌ను కొత్తపేట ఎస్‌డీపీఓగా నియమించిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ మురళీమోహన్ సీఐలు, ఎస్సైలతో సమీక్షించారు. అన్ని అంశాల్లోనూ ఉత్తమ పోలీస్ సబ్ డివిజన్‌గా గుర్తింపు తీసుకువచ్చేందుకు అందరూ సహకరించాలని కోరారు.

వ్యర్థాల నుంచి ఆదాయం పొందే విధానంపై సదస్సు

సఖినేటిపల్లి: వ్యర్థాల నుంచి ఆదాయం పొందే విధానంపై ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ గుండేపల్లి ప్రభావతి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం సఖినేటిపల్లిలంకలో ఈ మేరకు రైతులతో ర్యాలీ నిర్వహించిన ఆమె, అనంతరం సదస్సు ఏర్పాటు చేశారు. కొబ్బరి ఈ ప్రాంత వాసులకు కల్పవృక్షమని, అలాగే కొబ్బరికి సంబంధించి ఆకులు, డొక్క, చిప్ప వాటి ద్వారా కూడా ఆదాయం పొందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే వరిపంట కోసిన తరువాత గడ్డి ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయవచ్చని, ఆ ఎరువు ద్వారా నేల సారాన్ని పెంచి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చన్నారు. విద్యార్థులు, గ్రామ పెద్దలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో ఏపీ మార్క్‌ఫెడ్ కార్యాలయాలు

మలికిపురం: రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ ఏపీ మార్క్‌ఫెడ్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు పేర్కొన్నారు. మలికిపురంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి మార్క్ ఫెడ్ పాలకవర్గం సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్‌సీడీసీ ద్వారా రూ.1000 కోట్లు రుణం ఏపీ ప్రభుత్వం ద్వారా తీసుకుని రాష్ట్ర పౌర సరఫరాల శాఖకు ఇవ్వడం జరిగిందని ఆయన వివరించారు. మార్క్ ఫెడ్‌లో ఖాళీలను భర్తీ చేయాలని కూడా నిర్ణయించామన్నారు.

80 అక్రమ మద్యం బాటిళ్ల స్వాధీనం

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వీరు యానం నుంచి ఈ మద్యాన్ని గుద్దటి దుర్గాప్రసాద్, గుద్దటి రాములు తరలిస్తున్నట్లు తెలిపారు. సుమారుగా 80 మద్యం బాటిళ్లను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరూ ఈ మద్యం బాటిళ్లలో మద్యం సగం తీసి వేసి నీటిని కలిపి ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారన్నారు. మద్యం సీసాలను కల్తీ చేసేందుకు వీరికి కొండుకుదురులో తయారీ కేంద్రం ఉన్నట్లు చెబుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

ఆలమూరు: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జైలుశిక్షను విధించింది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల వాహనాల తనిఖీల్లో భాగంగా మండలంలో వివిధ కూడళ్లలో సోదాలు నిర్వహించారు. ఈక్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన ఎ.శ్రీరామకృష్ణ, ఆలమూరుకు చెందిన పి.భాస్కర గణేష్, మడికి గ్రామానికి చెందిన కె.శ్రీనును అరెస్ట్ చేసి శుక్రవారం స్థానిక కోర్టులు హాజరు పర్చారు. దీంతో ఆ ముగ్గురు నిందితులకు నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ తీర్పును వెలువరించారు. ద్విచక్ర వాహనదారులు తమ వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ తెలిపారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాల వల్ల డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు కఠిన శిక్షలు విధించబడుతున్నాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఉచిత కంటి పరీక్షలు



పెనికేరులో రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఆలమూరు: మండలంలోని పెనికేరులో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. మండపేట కేజీ బేసిన్ పరిధిలోని ఓఎన్‌జీసీ నేతృత్వంలో డిల్లీకి చెందిన అనుగ్రహ దృష్టిదాన్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య శిబిరాన్ని గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ఈదల చినబాబు, సర్పంచ్ వనుం చిన్నావతి ప్రారంభించారు. ఈ శిబిరానికి రాజమహేంద్రవరానికి చెందిన డివైన్ ఐ ఫౌండేషన్ పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు ఎస్‌కే కరీముల్లా, పి.పద్మావతి, ఎన్.చంటిబాబు విచ్చేసి సుమారు 347 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి శస్త్రచికిత్సలు అవసరమైన 57 మంది రోగులను రాజమహేంద్రవరంలోని తమ కంటి ఆస్పత్రికి తరలించారు. ఓఎన్‌జీసీ సైట్ ఇన్‌చార్జి సంజయ్ రౌత్వాల్, కోన దత్తుడు, గొడవర్తి సూర్య భాస్కరరావు, వనుం జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.